

4.28 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వానాకాలం 4,28,850 ఎకరాల్లో పంటలు సాగు కానున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

- 8లో



బస్సులు రాక అవస్థలు

భువనగిరి బస్టాండ్‌కు పూర్తిస్థాయిలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో

గరిష్టం / కనిష్టం
40° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25న సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

బొమ్మలరామారం : మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామంలో గల శ్రీ సాయిధామం ఆశ్రమంలో ఈ నెల 25న ప్రకృతి, గో ఆధారిత సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సాయిధామం పీఠాధిపతి శ్రీ రామానందప్రభూజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన ఎరువులు, దేశీ విత్తనాలు, కశాయాల మిశ్రమాలు, భూ పరీక్షలు, మార్కెటింగ్ మెలకువలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.మొక్కల ఎదుగుదలకు, దిగుబడికి అవసరమయ్యే సూక్ష్మ, స్థూల పోషకాల హెచ్చు తగ్గుల గుర్తింపు, 120 రకాల వరి విత్తనాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. శిక్షణలో పాల్గొనేందుకు రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఆశ్రమ సేవకులు బొమ్మకంటి మల్లేష్, కాటం బలేష్ కుమార్ సెల్‌నంబర్లు 9490850766, 9848088853 సంప్రదించాలన్నారు.

హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు నోటీసులు జారీ



తుర్కపల్లి మోడల్ స్కూల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

తుర్కపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, రాంపూర్‌లోని మోడల్, కేజీబీవీలు, మల్లాపూర్, దత్తాయపల్లి, మల్కాపూర్ పాఠశాలలను డీఈఓ నారాయణరెడ్డి గురువారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. దత్తాయపల్లి జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంతో హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేశారు. రాంపూర్ మోడల్ స్కూల్, కేజీబీవీలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రిన్సిపాళ్లు లేకపోవడం, డీఈఓ వస్తున్నట్లు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో వారికి కూడా నోటీసులు ఇచ్చారు. గడువులోపు పనులు పూర్తి కావాలని, నోడల్ అధికారులు, హెచ్‌ఎంలు పనులు పరిశీలించి ఏరోజుకారోజు నివేదికలు అందజేయాలని పేర్కొన్నారు. అదే విధంగా తుర్కపల్లిలోని విద్యార్థుల యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని డీఈఓ సందర్శించి యూనిఫామ్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి పట్టు వస్త్రాలు బహూకరణ



ఈఓకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న వ్యాపారి చాట్ల వెంకటేష్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన చాట్ల ఫ్యాబ్రీ సెంటర్ నిర్వాహకులు చాట్ల వెంకటేష్- పుష్ప, చాట్ల లక్ష్మీకాంత్, రాజమహేంద్ర కమటంలు రూ.2,12,697 విలువైన పట్టు వస్త్రాలు బహూకరించారు. శ్రీస్వామి వారి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పట్టు వస్త్రాలు అందజేసినట్లు చాట్ల వెంకటేష్ వెల్లడించారు. ప్రతి సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలు, జయంత్యుత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. అంతకుముందు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ లోకల్ అడ్వైజరీ మెంబర్ వడ్లోజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జీసీడీఓ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని జీసీడీఓ రాధ గురువారం సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. డ్రెయినేజీ, ఇతర మైనర్ పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని పంపాలని ఏఈ ధనలక్ష్మిని ఆదేశించారు.

పోలింగ్‌కు రెడీ!

27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు

- యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో 37 పోలింగ్ కేంద్రాలు
- పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- సెక్టార్ ఆఫీసర్లు, ఎఫ్‌ఎస్టీ, వీడియో, ఎంసీసీ టీంలకు శిక్షణ పూర్తి
- బరిలో 52 మంది అభ్యర్థులు
- జంబో బ్యాలెట్ పేపర్ సిద్ధం



బొమ్మలరామారంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ అమరేందర్

సాక్షి, యాదాద్రి : వరంగల్ -ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఏర్పాట్లు తుది దశకు చేరాయి. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అవసరమైన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల యంత్రాంగం సిద్ధం చేసింది. పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలకు శిక్షణ కూడా ఇచ్చారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతుకే.జెండగే పర్యవేక్షిస్తున్నారు.

డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాలు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోసం యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు డివిజన్ల వారీగా 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భువనగిరి డివిజన్‌లో 22, చౌటుప్పల్ డివిజన్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. ఓటర్లు జిల్లా పరిధిలో మొత్తం 34,080 మంది ఓటర్లు ఉన్నారు. భువనగిరి డివిజన్‌లో 20,205 మంది ఓటర్లు నమోదు కాగా ఇందులో మహిళలు 7,784, పురుషులు 12,421 మంది ఉన్నారు. చౌటుప్పల్ డివిజన్‌లో 13,875 మంది ఓటర్లకు గాను మహిళలు 5,458, పురుషులు 8,417 మంది ఉన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ఓటర్లకు పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

బ్యాలెట్ విధానం..

ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ విధానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. మొత్తం 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉండడంతో జంబో బ్యాలెట్ పేపర్ తయారు చేశారు.

పోలింగ్ రోజు ఆంక్షలు

పోలింగ్ రోజు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించకుండా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. జనం గుంపులుగా సంచరించకుండా 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా, కోడ్ ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోనున్నారు.

ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా సెక్టార్ ఆఫీసర్లు, ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. పోలింగ్ సమయం ముగిసే 4గంటలలోపు పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చిన ఓటర్లందరికీ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతి ఇస్తాం.

–హనుమంతు కే.జెండగే, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

ప్రత్యేక బృందాలు ఇవీ..

ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేకంగా 52 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో సెక్టార్ అధికారులు 12, ఫ్లయింగ్ స్క్వాడ్ 6, వీడియో 17, ఎంసీసీ టీంలు 17 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు ఎన్నికల సామగ్రి తరలించడం, పోలింగ్ అనంతరం మెటీరియల్‌ను తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు చేర్చే బాధ్యతలు సెక్టార్ అధికారులకు అప్పగించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహిస్తారు.



రాఘవాపురం కొనుగోలు కేంద్రంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పరిశీలిస్తూ.. భరోసానిస్తూ

- రాఘవాపురం, రుద్రవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కిషన్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

బీబీనగర్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి గురువారం బీబీనగర్ మండలం రాఘవాపురం, రుద్రవెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తొలుత రాఘవాపురం కొనుగోలు కేంద్రంలో అకాల వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లలో తలెత్తుతున్న సమస్యలు తెలుసుకున్నారు. అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. అలాగే కేంద్రం నిర్వాహకులను కొనుగోళ్లలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. ఎప్పటిలోపు కొనుగోళ్లు పూర్తవుతాయని అడగా.. వారం రోజుల్లో పూర్తి చేస్తామని నిర్వాహకులు చెప్పారు. అనంతరం రుద్రవెల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వర్షాలకు తడిసిన ధాన్యం బస్తాలు, ధాన్యం కుప్పలను పరిశీలించారు.

యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలి: కిషన్‌రెడ్డి

ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపడుతామని మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏ గ్రేడ్, బి గ్రేడ్ అనే తేడా లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సిగ్గులేని సీఎం అని, రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ బాటలోనే రేవంత్ కూడా నడుస్తున్నాడని, మూడు నెలల్లోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల నిధులు విడుదల చేస్తుందని, అయినా రైతులను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కిసాన్ మోర్చ జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకుల జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మండల నాయకులు అశోక్, జంగారెడ్డి, ప్రభాకర్, జగన్మోహన్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముప్పున్నా.. ఏదీ కనువిప్పు



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

ఆలేరు - కొలనుపాక మధ్య కలగానే హైలెవల్ బ్రిడ్జి

- ఏటా వానాకాలంలో తప్పని అవస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- రెండు నెలల క్రితం జీహెచ్‌కే సంస్థతో ఒప్పందం
- నేటికీ మొదలు కాని పనులు

ఆలేరురూరల్ : ఆలేరు–కొలనుపాక మధ్య వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. వర్షాకాలంలో కొలనుపాక వాగు ఉధృతంగా ప్రవహించిన ప్రతీ సారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వరద ఉధృతి తగ్గే వరకు కొలనుపాక, రాఘవాపురం, బైరామ్‌నగర్ పరిసర గ్రామాల ప్రజలు ఆలేరుకు 15 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా రాజాపేటతో పాటు బచ్చన్నపేట, పోచన్నపేట, చేర్యాల, సిద్దిపేట జిల్లాకు ప్రధాన మార్గం. వ్యాపార నిమిత్తం వాహనాలువందలాదిగా ఈరోడ్డు గుండా రాకపోకలుసాగిస్తుంటాయి.

కొట్టుకుపోయిన ప్రయాణికులు

రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి లేకపోవడంతో వరదలు వచ్చినప్పుడు ప్రయాణికులు కొట్టుకుపోతున్నారు. గతంలో వాగులో కొట్టుకుపోయి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. రాకపోకలు నిలిచిపోయి అత్యవసర పరిస్థితిలో వాగు దాటేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

రూ.4.50 కోట్లు మంజూరు

వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. బ్రిడ్జి నిర్మాణానికి జీహెచ్‌కే సంస్థతో రెండు నెలల క్రితం ఒప్పందం కుదిరింది. కానీ, నేటికీ పనులు ప్రారంభించలేదు. అధికారంలోకి వస్తే బ్రిడ్జి నిర్మిస్తామని ఎన్నికల సమయంలో పలు రాజకీయ పార్టీలు హామీ ఇచ్చాయి. నూతన ప్రభుత్వం ఏర్పడినా కార్యరూపం దాల్చలడం లేదు. సమస్యను ఈ ప్రాంతవాసులు అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు.

వాగొస్తే ఇబ్బంది పడుతున్నాం



ప్రతి సంవత్సరం వానా కాలం కొలనుపాక వాగు పోసినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. ఏ చిన్న పనికైనా ఆలేరు పట్టణానికి వెళ్లాల్సి ఉంటుంది. కొన్ని ఏళ్ల నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులు, నాయకులను వేడుకుంటున్నాం. ఓట్ల కోసం వస్తారే తప్పా.. సమస్యను పటించుకోరు.

–ఎండీ సర్వేర్‌పాష, కొలనుపాక

ఎమ్మెల్యే చొరవ చూపాలి



కొలనుపాక నుంచి ఆలేరుకు, ఇతర ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి. వాగుతో ప్రతి సంవత్సరం వానాకాలం ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణం చేస్తామని ప్రజాప్రతినిధులు అనేక వాగ్దానాలు చేసిన నీటి మూటలుగానే మిగిలాయి. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి.

–గడ్డం నాగరాజు, కొలనుపాక

కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



అసిస్టెంట్ రిటర్నింగ్, నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : కౌటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్, నోడల్ అధికారులతో సమావేశమై భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. చేయాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ హాల్‌కు, కౌంటింగ్ పూర్తయిన అనంతరం తిరిగి స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలను తరలించి సీల్ వేసే వరకు ప్రతి దశలో ఎన్నికల నిబంధనలను పక్కాగా పాంటించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, సిబ్బంది ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, స్టేషనరీ, ఫర్నిచర్‌తో ఏర్పాటతో పాటు తాగునీరు, టిఫిన్, భోజన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు గంగాధర్ (అదనపు కలెక్టర్), అమరేందర్ (ఆర్డీఓ), సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, బి.ఎస్.లత, డి.కొమరయ్య, కె.అనంతరెడ్డి, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయండి

రాజాపేట : ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. గురువారం ఆయన రాజాపేట మండలం రేణికుంటలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలపై కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించాలని, సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్‌లై డీఎం గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, బీపీసీఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ దామోదర్, ఆర్‌ఐ సలీమ్, సీఈఓ సిలివేరు శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రావద్దు



విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

- ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

భువనగిరి : వర్షకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ అన్నారు. గురువారం భువనగిరిలోని విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని, సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సిబ్బంది పగలు, రాత్రి కష్టపడి పనిచేశారని పేర్కొన్నారు. వారంరోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అవసరమైన ప్రదేశాల్లో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సరి చేయడానికి అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీజీఎం భిక్షపతి, డీఈటీ శ్రీనివాసాచారి, ఎస్‌ఓ చంద్ర, ఎస్‌ఈ శ్రీనాథ్, భువనగిరి, చౌటుప్పల్ డీఈలు మల్లికార్జున్, విజయభాస్కర్‌రెడ్డి, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికి ప్రచారం ముగించాలి

నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో ఉన్న అభ్యర్థులు 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రచారం ముగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రచారం ముగిసిన వెంటనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులను పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు.

బాలికల దత్తతే అధికం!

- ఆడపిల్లల దత్తత కోసం ఎక్కువగా దరఖాస్తు చేసుకుంటున్న దంపతులు
- రెండేళ్లలో ఎనిమిది మంది దత్తత
- అందులో ఒకరు బాలుడు, ఏడుగురు బాలికలు



భువనగిరి: జిల్లాలో దత్తత తీసుకుంటున్న వారిలో ఆడపిల్లలే అధికంగా ఉంటున్నారు. అబ్బాయిల కంటే అమ్మాయిలపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పిల్లల దత్తత కోసం సుమారు 100 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా ఆడబిడ్డ కావాలని దరఖాస్తు చేసుకున్న వారే ఎక్కువగా ఉన్నారు.

2023లో శిశుగృహ ఏర్పాటు

జిల్లా కేంద్రంలో 2023లో శిశుగృహ ఏర్పాటు చేశారు. నవజాత శిశువు నుంచి ఆరేళ్ల వరకు పునరావాసం కల్పిస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ, ఐసీపీఎస్ అధికారులు అమ్మ ప్రేమను పంచుతున్నారు. పిల్లల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సీనియారిటీ ప్రకారం దత్తత ఇస్తున్నారు. శిశుగృహలో ప్రస్తుతం 8 మంది సిబ్బంది ఉన్నారు. వీరంతా పిల్లల సంరక్షణ బాధ్యత చూసుకుంటారు. జిల్లాలో 2023 నుంచి ఇప్పటివరకు మొత్తం 8 మంది పిల్లలను దత్తత ఇచ్చారు. ఇందులో ఒకరు అబ్బాయి ఉండగా.. ఏడుగురు బాలికలు ఉన్నారు.

గతంలో అబ్బాయిల కోసం ఎక్కువ దరఖాస్తులు

గతంలో అబ్బాయిలను ఎక్కువగా దత్తత తీసుకోవడానికి ఆసక్తి చూపేవారు. అబ్బాయి కోసం మూడు, నాలుగేళ్ల వేచిచూసే వారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. అమ్మాయి అయితేనే తల్లిదండ్రులపై ప్రేమ ఎక్కువగా చూపుతున్నారని భావిస్తున్నారు. దీంతో బాలికలను ఎక్కువగా దత్తత తీసుకోవడానికి వస్తున్నారు. ఆడపిల్ల కోసం దరఖాస్తు చేసుకుంటే రెండు నుంచి మూడేళ్లలోపు దత్తత లభిస్తుంది.

సీరియల్ ప్రకారం..

పిల్లలు లేని దంపతులు దత్తత కోసం www.cara.nic.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత సీరియల్ ప్రకారం దత్తతకు పిలుస్తారు. ఒక పాప లేదా బాబు ఉన్నవారు దత్తతకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి పురుషులు, ఒంటరి మహిళలు సైతం అర్హులే. ఒంటరి పురుషులకు కేవలం అబ్బాయిని మాత్రమే ఇస్తారు.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

దంపతులు చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి. ఇందు కోసం ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సీరియల్ ప్రకారం పిల్లలను కేటాయిస్తాం. జిల్లాలో అడ పిల్లలను ఎక్కువ దత్తత తీసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటున్నారు.

– కృష్ణవేణి, మహిళా, శిశు సంక్షేమ జిల్లా అధికారి

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు
- 6,029 మంది విద్యార్థులు



భువనగిరిలోని కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

భువనగిరి : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,029 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 3,696, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,333 మంది ఉన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ, 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరగనున్నాయి.

పర్యవేక్షణకు సిబ్బంది ఇలా..

పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణకు 16 మంది సీఎస్, డీఓలను నియమించారు. వీరితో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఇద్దరు సభ్యులతో కూడిన డీఈసీ కమిటీని నియమించారు. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందం ఏర్పాటు చేయనున్నారు. పరీక్ష జరిగే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు.

క్లుప్తంగా

రసాయన పరిశ్రమలో వ్యక్తి మృతి

చౌటుప్పల్ : రసాయన పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామశివారులో గల ఎస్‌వీ ల్యాబ్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన కట్టబోయిన నాగరాజు(37) ఎస్‌వీ ల్యాబ్‌లో ప్లాంట్ ఇన్‌చార్జ్ పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బుధవారం రాత్రి 10గంటలకు విధులు ముగించుకునే క్రమంలో అకస్మాత్తుగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. గమనించిన సహచరులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డ్యూటీకి వెళ్లిన భర్త సమయం ముగిసినా ఇంటికి రాకపోవడంతో భార్య శిరీష కంపెనీకి ఫోన్ చేయడంతో విషయం తెలిసింది. మృతదేహానికి చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గురువారం మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

నల్లగొండ: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 26 వరకు ఆసక్తి గల మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. ఇక్కడ త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ కోసం ఈనెల 27 వరకు నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో గల సాహితీ బ్యూటీ పార్లర్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో రూ.3వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తారు. వివరాలకు 9666013544, 80747 42864 లో సంప్రదించాలి.

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్..

- 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 25 వరకు గడువు
- ఒక్కో పాఠశాలకు 160సీట్లు
- జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం


కేతేపల్లి : కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాల

కేతేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇంటర్మీడియట్ ఆంగ్లమాధ్యమంలో చదవాలనుకునే వారికి ఆదర్శ పాఠశాలలు ఓ వరంలా మారాయి. ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, పలురకాల మౌలిక వసతులు కల్పిస్తుండటంతో వాటికి ఆదరణ పెరిగింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 10నుంచి 25వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

ప్రతి పాఠశాలకు 160 సీట్లు..

ఆదర్శ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ప్రతి పాఠశాలలో 160మందికి అవకాశం కల్పించనున్నారు. ఈ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధించనున్నారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలలో చదువుకునే బాలికలకు హాస్టల్ వసతి ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 100మందికి ఈ అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల నుంచి ఆపై దూరంగా గ్రామాల నుంచి వచ్చే వారు మాత్రమే వసతిగృహంలో ప్రవేశానికి అర్హులు.

రేపటితో ముగియనున్న గడువు..

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 25(శనివారం) వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలలో ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్‌తో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్‌కు దరఖాస్తు చేయవచ్చు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్లను భర్తీ చేస్తారు. ఈనెల 26న దరఖాస్తులు పరిశీలించి ఎంపికైన వారి జాబితాలను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈనెల 27నుంచి 31వరకు ఎంపికైన విద్యార్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పించి జూన్ 1నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చక్కని క్రమశిక్షణ ఉంటుంది. అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుంది. మంచి వసతులు ఉన్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆటలకు ప్రాధాన్యతనిస్తాం. మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సబితారెడ్డి, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కొర్లపహాడ్

మహోన్నత వ్యక్తి.. అనంతరామ శర్మ


అనంతరామశర్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, వీరయ్య, ఇతర నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నల్లగొండ టౌన్: సమసమాజ నిర్మాణం కోసం అహర్నిశలు పోరాడిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ పోరాట యోధుడు, స్వాతంత్య్ర సమరయోధుడు పెన్నా అనంతరామశర్మ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో పెన్నా అనంతరామశర్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. అనంతరరామ శర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన వ్యక్తి శర్మ అని కొనియాడారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. అనంతరామ శర్మ ప్రజాసంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషిచేశారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ శర్మ నిస్వార్థ ఉద్యమకారుడని.. రాజకీయాల్లో సౌమ్యంగా ఉంటూ కఠిన నిర్ణయాలు తీసుకునేవాడని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, మల్లు లక్ష్మి, డీజీ నర్సింహారావు, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ శర్మ చిన్న వయసు నుంచి ఎర్రజెండా చేతపట్టి అంతిమ శ్వాస విడిచే వరకు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, ఎండీ జహంగీర్, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, వీరారెడ్డి, నాగార్జున, ఐలయ్య,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు

కట్టంగూర్: సీపీఎం సీనియర్ నేత పెన్నా అనంత రామశర్మ అంత్యక్రియలు గురువారం కట్టంగూర్ మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో అశ్రునయనాల నడుమ జరిగాయి. గ్రామంలో సీపీఎం కళాకారులు పాటలు పాడుతూ అంతిమయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట సీపీఎం జిల్లా కార్యదర్శులు, కటికం సత్తయ్యగౌడ్, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఇటికాల సురేందర్, బొజ్జ చినవెంకులు, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, చెవుగోని సాయిలు, చిన్నపాక లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి పాల్గొన్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనికుడు

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు

నాగార్జునసాగర్: ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గొప్ప దార్శనికుడు గౌతమ బుద్ధుడు అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు అన్నారు. గురువారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బైలు కుప్పే సెర బౌద్ధారామానికి చెందిన గెషే నవాంగ్ జుంగే, సికింద్రాబాద్ మహాబోధి బుద్ధ విహారం నుంచి వచ్చిన శీలం చారోలాతో కలిసి బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలోని ఆచార్య నాగార్జున కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర విభాగం పూర్వ అధ్యక్షుడు, చరిత్రకారిణి ఆచార్య అలోక పరా షేర్ షీకు బౌద్ధంలో స్నేహం అనే అంశంపై, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య మల్లేష్ సంకశాల బౌద్ధంలో సామాజికత అనే అంశంపై ప్రసంగించారు. బుద్ధవనం కన్సల్టెంట్ బౌద్ధ పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన బుద్ధుడి మొదటి ప్రవచనం, బుద్ధుడి చివరి రోజులు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సూదన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, హోటల్స్ జీఎం నాదన్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, విజయ్‌విహార్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.


బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేస్తున్న రమేష్‌నాయుడు తదితరులు

మంత్రి వెంకట్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

అర్వపల్లి : అడివెంల గ్రామానికి చెందిన జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ–సినీ మ్యూజిక్ డైరెక్టర్ అగస్త్య దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం బహూకరించారు.


మంత్రి వెంకట్‌రెడ్డికి చిత్రపటం అందజేస్తున్న రేఖ అగస్త్య దంపతులు

హుండీ అపహరణ

రామన్నపేట : ఆలయంలోని హుండీని గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఈ ఘటన మండలంలోని దుబ్బాక శివారులో గల వంక బయ్యన్న ఆలయంలో గురువారం చోటు చేసుకుంది. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వచ్చిన పూజారికి ఆలయంలో ఉన్న హుండీ కనిపించలేదు. దీంతో ఆలయ పరిసరాల్లో వెతికాడు. హుండీ కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఆలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. హుండీలో సుమారు రూ.10వేల వరకు నగదు ఉండొచ్చని భావిస్తున్నారు.

స్వర్ణగిరిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

భువనగిరి క్రైం : భువనగిరి పరిధిలోని పగిడిపల్లి వద్ద గల స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులిహోర, ప్రసాదాలను పరిశీలించారు. ప్రసాదాల తయారీ విభాగంలో పరిశుభ్రత పాటించాలని, బొద్దింకలు, ఇతర కీటకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. తనిఖీల్లో అధికారులు ఎం.సుమన్ కళ్యాణ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

4.28లక్షల ఎకరాల్లో సాగు అంచనా

- భువనగిరి జిల్లా వ్యవసాయాధికారి అనురాధ

చౌటుప్పల్ : వర్షాకాలంలో జిల్లాలో పంటల సాగు ప్రణాళికలు తయారు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వరి 1.85లక్షలు, పత్తి 1.35లక్షలు, చిరుధాన్యాలు 85వేల ఎకరాల్లో సాగవ్వనున్నట్లు తెలిపారు. గత వానాకాలంతో పోలిస్తే ఈ ఏడాదిలో సాగు సుమారుగా లక్ష ఎకరాలకుపైగా పెరగనుందన్నారు. ఈ సీజన్‌లో జిల్లాకు 2.70లక్షల ప్యాకెట్ల పత్తివిత్తనాలు, 71,012 క్వింటాళ్ల వరి విత్తనాలు, చిరుధాన్యాలు 208క్వింటాళ్లు, ఆయిల్ సీడ్ 68క్వింటాళ్ల అవసరం ఉందన్నారు. సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ప్రధానంగా విత్తనాల ఎంపికలో సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు స్థానికంగా ఉన్న ఏఓ, ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, ఏఈఓలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు..?

కేతేపల్లి : ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. విషయం తెలుసుకున్న యువకుడు బాలికను నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అడ్మిట్ చేసి అక్కడి నుంచి ఉడాయించినట్లు తెలిసింది. బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన అక్కడి వైద్యులు ఆమె గర్భవతి అని తేలడంతో వెంటనే జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన పోలీసులు బాలికతో వాంగ్మూలం తీసుకుని, యువకుడిపై పోక్సో చట్టం కింద కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు, బాలికను నల్లగొండలోని భరోసా కేంద్రంలో ఉంచినట్లు, కేసు దర్యాప్తులో స్థానిక పోలీసుల ప్రమేయం లేకుండా ఎస్పీ చందనాదీప్తి, నల్లగొండ డీఎస్పీల ఆధ్వర్యంలో కేసు సమగ్ర దర్యాప్తు సాగుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి తమ వద్ద వివరాలు లేవని మండల పోలీసులు వెల్లడించారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా

- ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

రామగిరి(నల్లగొండ): తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా తిప్పర్తి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. కారులో ఉన్న మిగతా నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చలివాది రేఖా ప్రియాంక(31), భర్త శివసుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిక్షిత్, తేజ్ వర్ధన్‌లు ఉన్నారు. కుటుంబంతో కలిసి తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గురువారం తెల్లవారుజామున డ్రైవర్ కడియపుడి మహేంద్ర అతివేగంతో కారు నడపడంతో తిప్పర్తి పోలీస్‌స్టేషన్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ఉన్న రేఖాప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శివసుబ్రహ్మణ్యం, ఇద్దరు పిల్లలు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి చలువాది వెంకటసుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహేంద్రపై ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


ప్రమాదంలో మృతిచెందిన రేఖా ప్రియాంక

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంద్యాల మల్లారెడ్డి పెద్ద కుమార్తె శిరీషకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులవారి గూడేనికి చెందిన యల్మరెడ్డి వెంకటరెడ్డితో 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హేమంత్‌రెడ్డి (19) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. హేమంత్‌రెడ్డి గురువారం తాత మల్లారెడ్డి ట్రాక్టర్‌తో చెల్క దున్నడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న గాతులో పల్టీ కొట్టింది. దీంతో హేమంత్‌రెడ్డిపై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకొని మహిళ బలవన్మరణం

మోత్కూరు : తల్లిపై కొడుకు చేయి చేసుకోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఓ తల్లి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మంచె కుమారస్వామి – రేఖ దంపతులకు కుమారుడు మచ్చగిరి (నాని), కూతురు వైష్ణవి ఉన్నారు. కుమారుడు మచ్చగిరి హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివి ఫెయిల్ అయ్యాడు. దీంతో తల్లి చదువుపై శ్రద్ధపెట్టి మంచిగా చదువుకోవాలని కొడుకు మచ్చగిరిని మందలించింది. ఆవేశంతో కొడుకు తల్లి రేఖపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. భర్త కుమారస్వామి భార్యను వంట చేయడానికి తలుపుతట్టడంతో ఎంతకూ తీయకపోగా తలుపు పగులకొట్టి చూడగా అప్పటికే రేఖ మృతి చెందింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందగా స్థానిక ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

రామన్నపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయపల్లి మల్లయ్య(55) రోజు మాదిరిగా గురువారం గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో సమీపంలో ఉన్న వారు అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటమ్మ(పద్మ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

చింతచెట్టు పైనుంచి పడి..

మేళ్లచెరువు: చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ గురువారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని చెరువుకట్ట సమీపంలో ఉన్న చింతచెట్టు ఎక్కి చిగురు కోస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

పాత నేరస్తుడి దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితులు


లింగు (ఫైల్)

భువనగిరి క్రైం: జనవరి 16న కనిపించకుండా పోయిన భువనగిరి మండలంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు దారుణ హత్యకు గురయ్యాడు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ విచారణ చేయగా.. ఈ లింగు హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం మూసీ నదిలో లింగు మృతదేహం వెలికితీశారు. పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు(45) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన చెల్లెలితో అదే గ్రామానికి చెందిన బానోతు దేవిసింగ్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తరచూ అతడిని బెదిరించేవాడు. దీంతో దేవిసింగ్ భయాందోళనకు గురై అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడైన నరేష్ సాయంతో జనవరిలో లింగును హత్య చేసి గ్రామ శివారులో ఉన్న మూసీ నది మధ్యలో పడేసినట్లు తెలుస్తోంది. అనంతరం తనపైకి రాకుండా లింగు చెల్లెలితో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు బానోతు దేవిసింగ్‌ను అనుమానించి పలుమార్లు విచారణ చేపట్టారు. గురువారం దేవిసింగ్‌ను భువనగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో లింగుని తన వ్యవసాయ క్షేత్రం వద్ద హత్య చేసి ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి మూసీ నదిలో వేసినట్లు చెప్పాడు. కాగా.. లింగుపై గతంలో హత్య కేసు, దొంగతనాల కేసులు ఉన్నాయి.

యాదాద్రి కొండపై కూలిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంతో పాటు యాదాద్రి కొండపైన బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో యాదాద్రి కొండపైన పరిసరాలలో చలువ పందిళ్లు కుప్పకూలాయి. దీంతో ఉదయం భక్తులు ఆయా మార్గాల్లో నడిచే సమయంలో ఇబ్బందులు పడ్డారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తమై.. కూలిపోయిన చలువ పందిళ్లను తొలగించారు.


యాదాద్రి కొండపై ఈదురుగాలులతో నేలకూలిన చలువ పందిళ్లు